సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 21 । నవంబర్ । 2024



సోమశిలలో 70.71 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 70.71 టీఎంసీల నీరు ఉంది. డెల్టాకు 50, కండలేరుకు 2,600, ఉత్తర, దక్షిణ కాలువలకు 1100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.77,920
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,077
3 శాతం జీఎస్టీతో	రూ.7,289
నవర (8 గ్రా)	రూ.58,312

గరిష్టం/కనిష్టం
30.0 /24.1

వాతావరణం

జిల్లాలో గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత అధికంగా ఉంది. బుధవారం గాలో తేమ 74 శాతం ఉంది.

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టుల్లో నియామకాలు



నియామక పత్రాలను అందజేస్తున్న డీఈఓ బాలాజీరావు, ఏపీసీ ఉషారాణి

నెల్లూరు (టౌన్): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు నియామకాలు చేపట్టారు. మొత్తం 10 కేజీబీవీల్లో 14 నాన్ టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ ఉషారాణి ఆధ్వర్యంలో 13 పోస్టులను భర్తీ చేశారు. వీటిల్లో 8 అసిస్టెంట్ కుక్స్, ఒక స్వీపర్, రెండు స్కావెంజర్లు, రెండు డే అండ్ నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఉన్నాయి. డీఈఓ ఆర్. బాలాజీరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ మమత పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్టీఓ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి: ఉదయగిరి సబ్ ట్రెజరీ ఇన్‌చార్జి అధికారిగా యడవల్లి దయాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం వింజమూరు ఉపఖజానా అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏసీబీ దాడుల్లో ఉదయగిరి ఎస్టీఓగా పనిచేస్తున్న సీహెచ్ మమత లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా డీడీ గంగాద్రి ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

వికసిత భారత్ నిర్మాణానికి కృషి చేయండి

• జేసీ కె.కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: ఆర్థిక అసమానతలు లేని వికసిత భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని జేసీ కె.కార్తీక్ అన్నారు. ఈ నెల 14 నుంచి జరుగుతున్న 71వ అఖిలభారత సహకార వారోత్సవాల ముగింపు బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వికేంద్రీకరణ ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంతో దోహదపడుతుందన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య సంబంధ రంగాల్లో బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో పారదర్శకత ఉండదనే అపోహను పారదోలేందుకు ఉద్యోగులు కష్టపడి పని చేయాలన్నారు. తొలుత సహకార వారోత్సవాల విశిష్టతను జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వివరించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా కంప్యూటరైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన వివిధ సహకార సంఘాల సీఈఓలకు జేసీ జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శ్రీనివాసరావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, డివిజనల్ సహకార అధికారి సుధాభారతి పాల్గొన్నారు.

ధాబాల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎస్సై లతీఫున్నీసా

నెల్లూరు(క్రైమ్): ధాబాల్లో మద్యసేవనం, అనధికార మద్యం విక్రయాలు సాగుతున్నాయని ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని ధాబాల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. ధాబాల్లో మద్య సేవనానికి అనుమతించడం, అనధికార విక్రయాలు సాగించడం చట్టరీత్యా నేరమని, ఈ తరహా చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై 112కు ప్రజలు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?

- వైఎస్ జగన్‌పై పెట్టిన పోస్టింగ్‌లు కనిపించవా?
- వారిపై ఎందుకు కేసులు నమోదు చేయరు
- పార్టీ కేడర్‌కు అండగా ఉంటాం
- ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి వెళ్తాం
- వలంటీర్ల విషయంలో చంద్రబాబు మాట తప్పాడు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో కాకాణి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఆనం అరుణమ్మ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా యాక్టివిస్టులు పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మరి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఐ–టీడీపీ పేరుతో నీచంగా పెట్టిన పోస్టులు కనబడవా?. ఇటువంటి వారిపై కేసులు ఎందుకు నమోదు చేయరు' అంటూ రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిలదీశారు. ఇటువంటి కేసులను దీటుగా ఎదుర్కొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే క్యాడర్‌కు అండగా ఉంటామన్నారు. నెల్లూరులోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లాలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీలతో, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో మిథున్‌రెడ్డి ఆత్మీయ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనపై, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు అనేక రకాలుగా పోస్టులు పెట్టినా కూడా తాము వారిని వేధించలేదన్నారు. చంద్రబాబు మాటలకు ఎంత విలువ ఉంటుందో ప్రజలందరికీ తెలుసని, ఆయన మాటమీద నిలబడే వ్యక్తి కాదని ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చాక వారి అవసరం లేదంటూ కూటమి మంత్రులే చెబుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు మరెన్ని యూటర్నులు తీసుకుంటారో వేచి చూడాలన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో, కౌన్సిల్‌లో నిలదీసేందుకు వెనుకాడమన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తమ ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీకి హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడే వీలు లేకుండా పోయిందన్నారు. తమ పార్టీ ఓడిపోయినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న క్యాడర్ ఎక్కడికీ పోలేదని అండగానే ఉందని స్పష్టం చేశారు. అభద్రతా భావం ఎక్కడా లేదని తామంతా కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు అందరం కలిసికట్టుగా పని చేస్తామని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

- మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చో పెట్టడమే తమ లక్ష్యమన్నారు. అందుకు జిల్లాలో అన్ని స్థానాల్లో మరో సారి వైఎస్సార్‌సీపీ గెలిచే విధంగా మిథున్‌రెడ్డితో కలిసి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.
- మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుంటూ అందరం కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. సోషల్ మీడియాకు సంబంధించి అరెస్టులు చేసి ఈ ప్రభుత్వం శునకానందం పొందుతున్నారన్నారు. గతంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ వారు అనేక పోస్టులు పెట్టారని, అప్పుడు తాము టీడీపీ మాదిరిగా కక్ష సాధింపు చర్యలకు దిగలేదన్నారు. వాటిని పట్టించుకుని ఉంటే ఇంతకు పదింతలు చర్యలు తీసుకునే అవకాశం ఉండేదన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తమ క్యాడర్ భయపడదని తామంతా వైఎస్ జగన్ వెంటే ఉంటామన్నారు. టీడీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని, చదువుకునే పిల్లలు, పార్టీకి మద్దతుగా ఉంటున్న వారిపై కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. దమ్ముంటే వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసిన అభ్యర్థుల మీద కేసులు పెట్టుకోండి. వాటిని తాము ఎదుర్కొంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీతోపాటు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఆత్మీయ సమావేశంలో మిథున్‌రెడ్డి

రాజకీయాల్లో ఉన్నంత వరకు జగన్ వెంటే

- రేటింగ్‌లు పెరుగుతాయంటే నామీద ఏమైనా రాసుకోండి
- త్వరలోనే యాక్టివ్ అవుతా
- అధికారం అడ్డుపెట్టుకుని శునకానందం
- మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నానంటూ కొన్ని చానల్స్‌లో వస్తున్న ప్రచారాలపై ఆయన ఘాటుగా స్పందించారు. నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన మీద వార్తలు రాసి టీఆర్పీలు పెంచుకోవాలని కొన్ని చానల్స్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయన్నాయని, తద్వారా చానల్స్ రేటింగ్‌లు పెరుగుతాయంటే ఏమైనా రాసుకోవచ్చన్నారు. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కొద్ది రోజులు జిల్లా రాజకీయాలకు దూరంగా ఉన్నానని చెప్పారు. త్వరలోనే జిల్లా రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని, నాన్ స్టాప్ కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు. పాత కేసుల్లో తన పేరు ఇరికించి అక్రమంగా అరెస్ట్ చేయాలంటూ కొందరు లోకేశ్ వెంట తిరుగుతున్నారన్నారు. అధికారం చేతిలో పెట్టుకుని, తనపై అక్రమ కేసులు పెట్టించి శునకానందం పొందాలని చూస్తున్నారన్నారు. ఎన్ని కేసులు అయినా పెట్టుకోండి భరిస్తా, మేము అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తానన్నారు. పల్నాడుకెళ్లి తాను పోటీ చేస్తే ఎమ్మెల్యేల కంటే తనకే 40 వేలు ఓట్లు అధికంగా వచ్చాయన్నారు. అక్కడి వారు తనపై ఎంతో అభిమానం చూపించారని, ప్రస్తుత పరిస్థితుల్లో తాను అక్కడికి వెళ్లానంటే కార్యకర్తలపై అనవసరంగా కేసులు పెట్టే అవకాశం ఉందన్నారు. అందుకోసమే కార్యకర్తలు ఆహ్వానిస్తున్నా వెళ్లలేకపోతున్నానన్నారు. నన్ను ఏ కేసులోనైనా ఇరికించి జైలుకు పంపి శునకానందం పొందినా, తాను భయపడేది లేదన్నారు. తనపై అలాంటి ఆలోచనలు చేసే వారి వయస్సు తనకంటే పది పదిహేనేళ్లు పెద్దవారేనన్నారు. తాను జైలుకు వెళ్లినా కూడా ఎంతో ఫిట్‌గానే ఉంటానని, తిరిగి మళ్లీ తాము అధికారంలోకి వచ్చినప్పుడు వారంతా వృద్ధాప్యంలో ఉన్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. అక్రమ కేసులు బనాయించాలనుకోనే వారు ఒక్కసారి ఆలోచించుకోవాలని హెచ్చరించారు. తమకు పార్టీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమని, ఆయన కోసం వంద కాదు వెయ్యి అడుగులైనా వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తెచ్చేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట)/రాపూరు: విధి నిర్వహణలో అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీలో కార్యదర్శులుగా పనిచేసిన టి.రాజశేఖర్, బి.మస్తానయ్యపై నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదికలు అందజేయడంతో వారిని సస్పెండ్ చేశారు.

మహిళను లైంగికంగా వేధించిన..

తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన గిరిజన మహిళను లైంగిక వేధింపులకు గురి చేయడంతో రాపూరు మండలంలోని రాపూరు సిద్ధవరం, జోరేపల్లి పంచాయతీల కార్యదర్శిగా పనిచేస్తున్న చెంచయ్యను సస్పెండ్ చేశారు. సిద్ధవరం పంచాయతీ కోటూరుపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ నాగలక్ష్మి తన తండ్రి శంకరయ్య మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా సర్టిఫికెట్ ఇవ్వకుండా లైంగికంగా వేధింపులకు గురి చేయడం, వీడియో కాల్‌లో చూడాలని, గూడూరుకు రావాలని వేధిస్తుండడంతో ఈ నెల 4వ తేదీ కలెక్టర్‌కు, ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారించిన అధికారులు అతన్ని సస్పెండ్ చేశారు.

ఎస్టీఓ కార్యాలయం రికార్డుల తనిఖీ

ఉదయగిరి: ఉదయగిరి ఉపఖజానా కార్యాలయం రికార్డులను ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం వరకు నిశితంగా తనిఖీ చేశారు. ఎస్టీఓ సీహెచ్ మమత మంగళవారం ఏసీబీ అధికారులకు పట్టుబడిన నేపథ్యంలో పెండింగ్ రికార్డులతో పాటు పాస్ చేసిన బిల్లుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్టీఓను నెల్లూరు ఏసీబీ కార్యాలయానికి తరలించారు. దాదాపు పది మంది ఏసీబీ అధికారులు 14 గంటల పాటు రికార్డులు పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది. పలు విషయాలకు సంబంధించి ఎస్టీఓను ఏసీబీ డీఎస్పీ శిరీష పూర్తి స్థాయిలో విచారణ చేసినట్లు తెలుస్తోంది.

మానవత్వమా.. నీ జాడెక్కడ?

- గుండెపోటుతో బెంగాల్ వాసి మృతి
- పట్టించుకోని మేస్త్రి
- ఆస్పత్రి వద్ద మృతదేహంతో కుటుంబసభ్యుల రోదన



ఆస్పత్రి బయట మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

విడవలూరు: పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఓ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబసభ్యుల చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. ఏం చేయలేక మృతదేహాన్ని ఆస్పత్రి బయట పెట్టి కన్నీరుమున్నీరుగా రోదించారు. మానవత్వానికి మాయని మచ్చగా నిలిచిన ఈ ఘటన బుధవారం విడవలూరులో జరిగింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన కొందరు పొలం పనుల కోసం విడవలూరు గ్రామానికి వచ్చారు. బుధవారం పనిచేస్తున్న సమయంలో ఉమిత్ (30) అనే వ్యక్తి ఒక్కసారిగా కింద పడిపోయాడు. అతడిని స్థానికంగా విడవలూరు పీహెచ్‌సీకి ట్రాక్టర్‌లో తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో ఉమిత్ మృతి చెందాడని నిర్ధారించారు. పనికి తీసుకెళ్లిన మేస్త్రి ఉమిత్ గురించి పట్టించుకోలేదు. వారి వద్దకు రాలేదు. తల్లి, కుటుంబ సభ్యులకు భాష తెలియకపోవడం, చేతిలో డబ్బుల్లేకపోవడంతో ఏం చేయాలో తెలియక మృతదేహాన్ని పీహెచ్‌సీ ఆవరణలో ఉంచి గంటల తరబడి కన్నీరుమున్నీరుగా రోదించారు. ఎవరూ సాయం చేయకపోవడంతో బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొందరు చేతులతో మృతదేహాన్ని మోసుకెళ్లారు. పీహెచ్‌సీకి సమీపంలో ఖననం చేశారు. ఉమిత్‌కు వివాహం కాలేదు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.



ఉమిత్ మృతదేహం

అంత్యక్రియలకు డబ్బుల్లేక..



పెంచలయ్య మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. అంత్యక్రియలకు డబ్బుల్లేక కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద నిరీక్షిస్తున్న హృదయ విదారక ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన దేవళ్ల వెంకమ్మకు పక్కాగృహం వచ్చింది. దాని నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆమె తన కుమారుడు పెంచలయ్య (49), కోడలు రాజేశ్వరితో కలిసి ఫ్లై ఓవర్ కింద నివాసం ఉంటోంది. పెంచలయ్య బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతడికి గుండెనొప్పి రావడంతో తల్లి, భార్య జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పెంచలయ్య మృతి చెందాడని వైద్యులు చెప్పారు. సొంతిల్లు లేదు. అంత్యక్రియలకు డబ్బు లేకపోవడంతో వెంకమ్మ, రాజేశ్వరి ఫ్లై ఓవర్ కింద మృతదేహాన్ని పెట్టుకుని రోదిస్తున్నారు. వీరిని ఆదుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కార్పొరేషన్ అధికారులు స్పందించి అంత్యక్రియలు నిర్వహించాలని వేడుకుంటున్నారు.

నాటుబాంబు పేలి ఆవుకు తీవ్రగాయం



నాటు బాంబు పేలడంతో గాయపడిన ఆవు

మనుబోలు: మండలంలోని మడమనూరు సమీపంలో మేత మేస్తున్న ఆవు పొరపాటుగా నాటు బాంబును కొరకడంతో అది పేలింది. దీంతో ఆవుకు తీవ్ర రక్త గాయమైంది. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన గ్రామంలో సంచలనం రేకెత్తించింది. గ్రామానికి చెందిన పాడి రైతు అనింగి ద్వారకయ్య రోజూ మాదిరిగానే పశువులు తోలుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. పశువులు మేత మేస్తుండగా వేటగాళ్లు అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన నాటుబాంబును ఓ ఆవు కొరికింది. దీంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో బాంబు పేలింది. దూరంగా ఉన్న ద్వారకయ్య బాంబు శబ్దానికి భయపడి దగ్గరుకు వచ్చి చూడగా, ఆవు దవడ భాగం చీలిపోయి రక్తమోడుతూ కనిపించింది. వెంటనే ఆవును పశువైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స అందించారు. అయితే ఆవు పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ఈ ఘటనపై బాధిత పాడి రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ఎలా?

- ట్రాక్‌లను పరిశీలించాలని తెలియదా?
- క్లాస్ తీసుకున్న రైల్వే జీఎం



ట్రాక్ కొలతలను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

నెల్లూరు(సెంట్రల్): 'రైళ్లలో వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. వారి భద్రత రైల్వేపై ఆధారపడి ఉంది. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ఎలా?, ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారు?' అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రశ్నించారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ సమీపంలోని క్రాసింగ్ ట్రాక్‌ను తనిఖీ చేసి ఇక్కడ కొలతల్లో కొంత తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై సంబంధిత రైల్వే అధికారులకు క్లాస్ తీసుకున్నారు. ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన వారు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం కాదని, ముందుగా అంతా బాగుందా? లేదా? అని చూడాలని ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటిన ట్రాక్‌ను పరిశీలించి కొలతలను సరిచేశారు.

భవనాల పరిశీలన

ప్రధాన రైల్వేస్టేషన్లో రూ.102 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను జీఎం క్షుణ్ణంగా పరిశీలించారు. నాలుగు ప్లాట్ ఫారాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన అండర్ పాస్, అదే విధంగా ఫ్లై ఓవర్‌తోపాటు ఇతర భవనాలను తనిఖీ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.